క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సమావేశం నేడు

మార్టూరు: వైఎస్సార్ సీపీ మార్టూరు మండల సమావేశం మండలంలోని డేగరమూడి గ్రామంలో నేడు నిర్వహించనున్నట్లు మార్టూరు పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆడకా గంగయ్య యాదవ్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు మండల పార్టీ కన్వీనర్ జంపని వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశానికి పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మధుసూదన్ రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. మండలంలోని పార్టీ ప్రజా ప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పర్చూరు(చినగంజాం): పర్చూరు వైఎస్సార్ సీపీ మండల స్థాయి కార్యకర్తల సమావేశం సెప్టెంబర్ 2వ తేదీ మంగళవారం నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ కఠారి అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి పురస్కరించుకొని స్థానిక బొమ్మల సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన అనంతరం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో సమావేశం జరుగుతుందని తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాల్సిందిగా కోరారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా రామ్మోహన్‌రావు

కారంచేడు: ఎంపీడీఓగా డిప్యూటీ ఎంపీడీఓ వి. రామ్మోహనరావుకు బాధ్యతలు ఇస్తూ ఒంగోలు ముఖ్య కార్యనిర్వహణాధికారి వి. చిరంజీవి ఉత్తర్వులు ఇచ్చారు. పదోన్నతి పొంది కారంచేడు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న కె. నేతాజీకి సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు బాపట్లలో జరగనున్న శిక్షణా తరగతులకు హాజరు కావాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో రెండు రోజుల పాటు డిప్యూటీ ఎంపీడీఓ, ఎంపీడీఓగా కూడా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు.

ప్రధానోపాధ్యాయుల రాష్ట్ర జోనల్ సెక్రటరీగా పిడవర్తి


పిడవర్తి పేరిరెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర జోనల్ సెక్రటరీగా ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పిడవర్తి పేరిరెడ్డి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఆదివారం విజయవాడలోని లయోలా కళాశాలలో నిర్వహించారు. సమావేశంలో నిర్వహించిన ఎన్నికల్లో ఆయనను రాష్ట్ర జోనల్ సెక్రటరీగా ఎన్నిక చేసినట్లు పేరిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలి


పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): విద్యార్థులు పాఠ్యాంశాలతోపాటు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను చదవటం అలవాటు చేసుకోవాలని సంతమాగులూరు శాఖ లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవంటం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. 13 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

రుణాలు అందక.. ఉపాధి లేక!



- అటకెక్కిన కార్పొరేషన్ రుణాలు
- ఉపాధి యూనిట్ల కోసం నిరీక్షణ
- బీసీ, ఈబీసీ నిరుద్యోగుల ఎదురుచూపులు
- మండలంలో 36 యూనిట్లు మంజూరు
- ఆదిలోనే నిలిచిపోయిన ఎస్సీ రుణాలు

జె.పంగులూరు:

కార్పొరేషన్ల ద్వారా రుణాలిచ్చి యువతను ఆర్థికంగా బలోపేతం చేస్తామంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల ద్వారా రుణాల మంజూరు ప్రక్రియ అపహాస్యంగా మారింది. ఎస్సీ కార్పొరేషన్ రుణాల ప్రక్రియ దరఖాస్తు దశలోనే నిలిచిపోగా, బీసీ, ఈబీసీ రుణాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక పూర్తయినా సబ్సిడీ నగదు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాలు పూర్తవుతున్నా కార్పొరేషన్ రుణాలు ఎండమావిగానే మిగిలాయని నిరుద్యోగ యువత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బీసీ, ఈబీసీ రుణాలు ఎక్కడ?

కూటమి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాలకు నోటిఫికేషన్‌ను ఈ ఏడాది మార్చి నెలలో విడుదల చేసింది. ఉన్నత చదువులు చదివి ఉపాధి లేక ప్రభుత్వ సహాయ సహకారం కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు బీసీ కార్పొరేషన్ రుణ నోటిఫికేషన్ ఆశలను రేపింది. ఈ మేరకు బీసీ కార్పొరేషన్‌కు చెందిన వివిధ కులాల యువకులు రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ కార్యాలయాల ద్వారా దరఖాస్తులను ఆన్‌లైన్ విధానం ద్వారా స్వీకరించారు. దరఖాస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. సంబంధిత అధికారులను లబ్ధిదారుల సమాచారం చేరవేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కార్పొరేషన్ రుణాలు ఇస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన ఆదిలోనే నిలిచిపోయాయి.

> **అర్హుల జాబితాను అధికారులకు పంపాం**
> మండలంలోని 21 గ్రామాలకు సంబంధించి కాపు, బీసీ, ఈబీసీ కార్పొరేషన్లలకు సంబంధించి అర్హులను తేల్చాం. అర్హుల జాబితాను ప్రొసీడింగ్స్‌ను ఆయా కార్పొరేషన్ల ఉన్నతాధికారులను పంపాం.
> – కె. సుమంత్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

స్వయం ఉపాధి రుణాలు

నిరుద్యోగ యువతకు ఫ్లవర్ బొకే మేకింగ్ అండ్ డేకరేషన్, వర్మీకంపోస్టు అండ్ ఆర్గానిక్ మాన్యూర్, ప్లబింగ్ అండ్ ఎలక్ట్రీషియన్ సర్వీసెస్, వాటర్ రీ సైక్లింగ్, మొబైల్ రిపేరింగ్, సోప్అండ్ డిటర్జంట్ మేకింగ్, వెల్డింగ్ అండ్ ఫాబ్రికేషన్ యూనిట్, సోలార్ ఎనర్జీ సేల్స్, ప్రమోషన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, జనరిక్ మందుల దుకాణాలు, బ్యాటరీ ఆటోలు, బేకరీలు తదితర యూనిట్ల ద్వారా యువతకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి ఉపాధి కల్పించేందుకు సిద్ధం అయ్యింది. కూటమి ప్రభుత్వం, స్వయం ఉపాధి యూనిట్లకు 50 శాతం సబ్సిడీతో రుణం ఇప్పించాలని నిర్ణయించింది. ఈ పథకం ఎలగైనా తమకే దక్కాలని అనేక మంది ఎమ్మెల్యేలు, మంత్రులతో సిఫార్సు చేయించారు. సబ్సిడీ రుణాలకు ఎంపికైన అభ్యర్థుల లిస్టు ఎంపీడీఓలు సంబంధిత బ్యాంక్ బ్రాంచ్‌లకు సిఫార్సులు చేశారు. సబ్సిడీ పోను మిగిలిన సగం రుణం కింద ఇవ్వాలని యూనిట్ల వివరాలతో పంపించారు. కానీ ఇప్పటి ఏ ఒక్కరికి రుణం మంజూరు కాలేదు.

బీసీ కార్పొరేషన్ రుణాలు యూనిట్లు

మండల పరిధిలోని 21 గ్రామాలకు సంబంధించి బీసీలకు సంబంధించి నిరుద్యోగులకు 23 యూనిట్లకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేశారు. దానికి సంబంధించి ఉన్న తాధికారులకు జాబితాను అందించారు. 40 యూనిట్లకు గాను బీసీ- ఏ కులానికి సంబంధించిన 6 యూనిట్లకు గాను చందలూరు 1, చిన్నమల్లవరం 1, కోటపాడు 1, ముప్పవరం 1, రేణింగవరం 1, తూర్పు కొప్పెరపాడు 1 సబ్సిడీ లోన్లు అధికారులు సిద్ధం చేశారు. బీసీ- బికి సంబంధించి మండలంలో 4 యూనిట్లు మంజూరు వాటిలో బూదవాడ 1, ముప్పవరం 1, పంగులూరు 1, రేణింగవరం 1 యూనిట్లు గుర్తించారు. బీసీ- డి 5 యూనిట్లకు గాను అలవలపాడు 1, బూదవాడ 1, చందలూరు 1, కొండమూరు 1, రేణింగవరం 1 సిద్ధం చేశారు. బీసీ- ఇకి సంబంధించి 8 యూనిట్లకు గాను కల్లవారిపాలెం 1, ముప్పవరం 1, నూజిళ్ళపల్లి 1, పంగులూరు 1, రామకూరు 3, తూర్పు కొప్పెరపాడు 1 మంజూరు చేశారు.

ఓబీసీలకు సంబంధించి

మండల పరిధిలోని 21 గ్రామాలకు గాను ఓసీలుగా ఉండి ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ రుణాలు అందిస్తారు. మండలలోని 21 గ్రామాలకు 14 యూనిట్లను మంజూరు చేశారు. వాటిలో ఈబీసీకి సంబంధించి పంగూలూరు 1, రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి 3 యూనిట్లకు గాను రేణింగవరం 1, కల్లవారిపాలెం 1, అలవలపాడు 1, కమ్మ సామాజిక వర్గానికి సంబంధించి 7 యూనిట్లు గాను భగవాన్‌రాజుపాలెం 1, ముప్పవరం 2, రామకూరు 1, చందలూరు 1, నూజిళ్ళపల్లి 1, తూర్పు కొప్పెరపాడు 1, ఆర్యవైశ్యులకు సంబంధించి పంగులూరు 1 మంజూరు చేశారు. బూదవాడ గ్రామానికి సంబందించి రెడ్డి సామాజిక వర్గం నుంచి జనరల్ మెడికల్ షాపు నిమిత్తం 1 యూనిట్ మంజూరు చేశారు.

నాణ్యమైన పొగాకు తీసుకెళ్లాలి

పర్చూరు(చినగంజాం): రైతులు నాణ్యమైన పొగాకును మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్ళాలని తద్వారా అధికారులకు, రైతులకు శ్రమ తగ్గుతుందని అడిషనల్ కలెక్టర్ ఎస్. లవన్న సూచించారు. పర్చూరులో రోటరీ క్లబ్ భవనంలో ఆదివారం పొగాకు రైతులకు ప్రభుత్వం కొనుగోలు గ్రేడింగ్ విధానంపై అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసలు నాణ్యతలేని పొగాకును రైతులు కొనుగోలు కేంద్రం వరకు తీసుకురావడం వల్ల ఎక్కువ పొగాకు చెక్కులు కొనుగోలు జరగకుండా తిరిగి వెనక్కి పంపించడం జరుగుతుందన్నారు. ఇలా వెనక్కి పంపించడం వలన రైతులు నష్టపోతున్నారని అలా జరగకుండా ఉండాలంటే రైతులు నాణ్యమైన పొగాకు మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్ళాలని తెలియజేశారు. అలాగే రైతులు పండగల ఆకు పచ్చ గుల్ల ఆకు, బోగులు ఆకు, పనికిరాని ఆకు, బూజు పట్టిన ఆకు, పాడైపోయిన ఆకులు, తేమ ఎక్కువగా ఉన్న ఆకులు తీసుకు రాకూడదని అలాంటి ఆకులు ఉన్న చెక్కులను తిరిగి వెనక్కి పంపించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం, మార్క్‌ఫెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, జిల్లా మేనేజర్ కరుణశ్రీ, ఏడీఏలు, ఎంఏఓలు, వీఏఏలు మరియు పొగాకు బయ్యర్లు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ఆడపడుచుల నైవేద్యాలు


గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

కారంచేడు: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగాను, గ్రామ దేవతగాను విరాజిల్లుతూ ఎల్లప్పుడు భక్తుల పూజలందుకునే గంగమ్మ తల్లికి గ్రామానికి చెందిన ఆడపడుచులు పెద్ద ఎత్తున నైవేద్యాలు, పొంగళ్లను సమర్పించారు. ఆదివారం ఉదయం నుంచి మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన గంగమ్మ గుడి భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో పాటు గ్రామానికి చెందిన ఆడపడుచులు వివిధ గ్రామాల నుంచి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంతానం లేని వారు అమ్మవారికి మొక్కుబడులు చేసుకున్నారు. ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ భక్తులకు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

పార్టీ బలోపేతానికి కృషి

బల్లికురవ: మండల స్థాయి అధ్యక్షుల నియామకంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు బల్లికురవ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు ఆదివారం తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు మండల స్థాయి అధ్యక్షుల నియామకంతో గ్రామ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. మండల స్థాయి మండల యూత్ వింగ్ అధ్యక్షునిగా మక్కెన రవికుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా కొల్లముడి శింగమ్మ, రైతు విభాగం మేడగం శ్రీనివాసరెడ్డి, బీసీ సెల్ ఆరుమళ్ల సురేష్, ఎస్సీసెల్ ప్రత్తిపాటి అంకయ్య, ఎస్టీ సెల్ మూడావత్ హరికృష్ణ నాయక్, మైనార్టీ సెల్ షేక్ జాన్‌బాషా, క్రిస్టియన్ మైనార్టీ సెల్ పందిరి శ్రీనివాసరావు, స్టూడెంట్స్ వింగ్ అల్లాడి చంద్రశేఖర్, పంచాయతీ రాజ్ వింగ్ హంసావత్ కిషోర్ నాయక్, మున్సిపల్ వింగ్ షేక్ శ్రీనువలి, ఆర్టీఐ వింగ్ మూడావత్ దానానాయక్, వలంటీర్ వింగ్ కొండేటి చిన యేసు, గ్రీవెన్స్ సెల్ పల్లపు వెంకటేశ్వర్లు, వాణిజ్య విభాగం డి. అజయ్ కుమార్, వివర్స్ వింగ్ కావూరి సురేష్ బాబు, వైఎస్సార్ టీయూసీ విప్పల అంజిరెడ్డి, అంగన్‌వాడీ వింగ్ మసిముక్కల లక్ష్మి, లీగల్ సెల్ బండి గంగాప్రసాద్, కల్చరల్ వింగ్ డి. శ్రీనివాస్, సోషల్ మీడియా వింగ్ కొండవర్తి గోపిరాజు, ఐటీ వింగ్ తాళ్ల అంజిరెడ్డి, దివ్యాంగుల విభాగం పి. నాగరాజు, డాక్టర్స్ వింగ్ అడవి భాస్కర్, బూత్ కమిటీ వింగ్ గంగమనేని వెంకటరామిరెడ్డి, పబ్లిసిటీ వింగ్ గెల్లా హరిబాబుకు బాధ్యతలు అప్పగించినట్లు కృష్ణబాబు వివరించారు.

పీజీఆర్ఎస్‌కు హాజరు కావాలి

చీరాల టౌన్: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న పీజీఆర్ఎస్, రెవెన్యూ ఉద్యోగుల సమావేశానికి విధిగా రెవెన్యూ సిబ్బంది, అధికారులు హాజరుకావాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేస్తున్న కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని విచారణ వివరాలు, నీటి తీరువా వసూళ్లు, తదితర అంశాలకు సంబంధించిన సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

సముచిత స్థానం కల్పించిన మధుసూదన రెడ్డి


పర్చూరులో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు

పర్చూరు(చినగంజాం): పర్చూరు నియోజక వర్గ పరిధిలో దళితులకు సముచిత స్థానం కల్పించి పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పించిన నాయకుడు గాదె మధుసూదన రెడ్డి అని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధికార ప్రతినిధి బండారు ప్రభాకరరావు అన్నారు. పర్చూరు నియోజక వర్గ కేంద్రం అయిన పర్చూరులో ఆదివారం సాయంత్రం నియోజక వర్గంలోని దళితనాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్చూరు నియోజక వర్గ పరిధిలో పార్టీ స్థాపించిన దగ్గరు నుంచి మండల, గ్రామ స్థాయి కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదని, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి వచ్చిన తరువాత కమిటీల ఏర్పాటు చేశామన్నారు. నియోజక వర్గంలో పార్టీ అభివృద్ధి కోసం మొదటి నుంచి పనిచేసిన వ్యక్తులను గుర్తించి పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో త్వరితగతిన కమిటీలు వేసిన ఘనత ఇన్‌చార్జ్‌కు దక్కుతుందని అన్నారు. కమిటీల్లో ముఖ్యంగా దళితులకు సముచితమైన పదవులు ఇచ్చి గౌరవించిన ఘనత ఆయనదేనన్నారు. దళితుల్లో కొందరు స్వార్థపూరితమైన వ్యక్తుల మాటలు విని వ్యక్తిగత దూషణలకు దిగుటూ పార్టీ మీడియాలో ప్రచారం చేస్తూ పార్టీ ప్రతిష్టను దిగజార్చే విధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డిపై ఉన్న గౌరవం, పార్టీ పట్ల ఉన్న విధేయత, ఇన్‌చార్జ్ పట్ల నమ్మకంతో ముందుకు సాగుదామన్నారు. రాబోయే 2029 ఎన్నికల్లో పర్చూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేద్దామన్నారు. పర్చూరు నియోజక వర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నూతలపాటి బలరాం మాట్లాడుతూ గతంలో ఉన్న పార్టీ స్థితిగతులను పరిశీలించి అక్కడి సామాజిక పరిస్థితులను పరిగణలోనికి తీసుకొని ఇన్‌చార్జ్ మధుసూదనరెడ్డి కమిటీలు ఏర్పాటు చేశారన్నారు. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా కలిసి పనిచేస్తున్న సామాజిక వర్గంలో అంతర్గత విభేదాలతో దళితులమైన మనమే కించపరచుకుంటున్నానని తెలిపారు. సోషల్ మీడియా నియోజక వర్గ అధ్యక్షుడు కుమ్మరి చందు, యద్దనపూడి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాల సంచిక ఆవిష్కరణ అభినందనీయం


పావలా నాటికలో సన్నివేశం (ఫైల్)

వేటపాలెం: స్థానిక బండ్ల బాపయ్య హిందూ జూనియర్ కాలేజీ వద్దనున్న బాల భక్త భజన నాటక సమాజం, విద్యా గణపతి ఆలయం.. వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభించి 100 ఏళ్ల అయిన సందర్భంగా శతాబ్ది ఉత్సవాల సంచిక ఆవిష్కరించడం అభినందీయమని రోటరీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గొల్లపూడి సీతారాం ఆదివారం తెలిపారు. వందేళ్ల పాటు ఎంతో మంది మహనీయులు ఉత్సవాలకు చేయూతనందిస్తూ ముందుకు కొనసాగించారన్నారు. కీర్తిశేషులు బోడ్డు చెంచునాదం, సురేం ద్రనాదం ముఖ్యులని గుర్తుచేశారు. గణేష్ పాత్రో రచించిన పావలానాటిక ను జెడీవీ దర్శకత్వంలో ప్రదర్శించంపై ప్రశంసించారు.

సైకిల్ తొక్కండి ఆరోగ్యం పొందండి


సైకిల్ ర్యాలీ

సంతమాగులూరు(అద్దంకి): సైకిల్ తొక్కండి ఆరోగ్యంగా ఉండండి అనే నినాదంతో ఆదివారం మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. బాపట్ల ఎస్పీ పిలుపు మేరకు గట్కా అసోసియేషన్ అండ్ బ్రూస్లీ ఫాట్నెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించారు. వెల్లలచెరువు గ్రామం నుంచి అడవిపాలెం గ్రామం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు


క్షతగాత్రుడు డేవిడ్

బల్లికురవ: బైకు అదుపుతప్పి వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం అద్దంకి లో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు .. అద్దంకిలోని రాజీవ్ కాలనికి చెందిన డేవిడ్ బైకుపై రేణింగవరం వెళుతుండగా మార్గ మధ్యంలోని గరటయ్య కాలనీ వద్దకు రాగానే బైకు అదుపుతప్పి కింద పడి గాయాల పాలయ్యాడు. స్థానికుల సమాచారంతో 108 వాహనం వచ్చి క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు ఇలా..

పర్చూరు(చినగంజాం): దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని సెప్టెంబరు 2వ తేదీ మంగళవారం నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి నియోజక వర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనను న్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పర్చూరు బొమ్మల సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు చినగంజాం రైల్వేస్టేషన్ సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 5 గంటలకు మార్టూరు మండలం చిమ్మిరిబండలో వర్ధంతి కార్యక్రమం.. అనంతరం ఇంకొల్లు మండలంలోని పావులూరు గ్రామంలో వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనున్నట్లు తెలిపారు.

లడ్డూ వేలం ధర రూ.44,001


కోనంకిలో నిమజ్జనానికి తరలి వెళుతున్న గణనాథుడు

మార్టూరు: వినాయక చవితి పండగ సందర్భంగా మండలంలోని కోనంకి గ్రామంలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం వద్ద లడ్డూను రూ. 44001 ధర పలికింది. గ్రామానికి చెందిన అన్నవరపు వెంకటరావు లడ్డూ కోసం నిర్వహించిన వేలం పాట పాడుకొని ప్రసాదాన్ని దక్కించుకున్నారు. అనంతరం గణపతి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించి నిమజ్జనానికి తరలించారు.

ఐదో రోజు.. నిమజ్జనాల హోరు


చినగంజాం: తీరంలో గస్తీ నిర్వహిస్తున్న పర్యవేక్షిస్తున్న ఎస్ఐలు, సిబ్బంది


చీరాల: గణపయ్యకు తుది వీడ్కోలు పలుకుతున్న భక్తులు


వాడరేవులో పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

చీరాల టౌన్: చలువ పందిళ్లల్లో ఏర్పాటు చేసిన గణనాథులు ఐదో రోజు ఆదివారం నిమజ్జనాలు జోరుగా జరిగాయి. చీరాల పట్టణం, గ్రామాలతో పాటు పర్చూరు, అద్దంకి, చిలకలూరిపేట, నర్సరావుపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథులను తప్పెట్ల ఊరేగింపుల అనంతరం గంగ ఒడిలోకి వాడరేవు తీసుకువచ్చి నిమజ్జనం చేస్తున్నారు. బందోబస్తు ఏర్పాటు చేశామని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు తెలిపారు. తహసీల్దార్ కె.గోపీకృష్ణతో కలిసి ఆర్డీవో పరిశీలించి పలు సూచనలు చేశారు. సివిల్, మెరైన్, ఏఆర్ పోలీసులు, గజ ఈతగాళ్లతో బందోబస్తు నిర్వహిస్తు ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపడుతున్నారు.

బల్లికురవ: నక్కబొక్కలపాడు గ్రామాల్లోని హనుమత్ షిర్డీ సాయిబాబా అనుగ్రహ ధ్యాన మందిరం వద్ద 25 సంవత్సరాలుగా మందిరం ఏర్పాటుతో గణపతి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈర్లకొండ శ్రీశ్రీనివాసగ్రానైట్ క్వారీలో ఏర్పాటు చేసిన గణనాథుడిని నిమజ్జనానికి తరలించారు.

కారంచేడు: వినాయక నిమజ్జన సమయంలో కమిటీ సభ్యులతో పాటు, భక్తులు కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. కారంచేడుతో పాటు స్వర్ణ, కుంకలమర్రు గ్రామల్లో ఉన్న వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలను ఆయన తన సిబ్బందితో కలసి పర్యవేక్షించారు.

చినగంజాం: మండలంలోని చినగంజాం, సోపిరాల, మున్నం వారిపాలెం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, మోటుపల్లి, కడవకుదురు, పెదగంజాం, గొల్లపాలెం, తదితర గ్రామాలతో పాటు ఇంకొల్లు మండలంలోని పలు గ్రామాలకు చెందిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. భక్తులు ఆయా సముద్ర తీరంలో సందడి చేశారు. ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య ఆధ్వర్యంలో గట్టి చర్యలు తీసుకున్నారు. మోటుపల్లి రేవు వద్ద చినగంజాం ఎస్ఐ శీలం రమేష్, బాపయ్య నగర్ రేవు వద్ద ఇంకొల్లు ఎస్ఐ జీ సురేష్, పెదగంజాం పల్లెపాలెం వద్ద ట్రైనింగ్ ఎస్ఐ అనూష బందోబస్తు నిర్వహించారు.


నక్కబొక్కలపాడులో నిమజ్జనానికి తరలిన గణనాథుడు


చినగంజాం: సముద్ర తీరంలో భక్తులు


కారంచేడు వద్ద పర్యవేక్షిస్తున్న ఎస్ఐ ఖాదర్ బాషా